## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- కలెక్టర్ హనుమంతరావు
- కొనుగోలు కేంద్రాల ఆకస్మిక తనిఖీ



శివారెడ్డిగూడెంలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ హనుమంతరావు

భూదాన్ పోచంపల్లి, మే 18 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మండలంలోని జూలూరు, పోచంపల్లి, శివారెడ్డిగూడెం, దంతూరు గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల నిర్వహణ తీరు, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు చేసినా ట్రాన్స్‌పోర్ట్ లేక పోవడంతో ఇబ్బందులకు గురవుతున్నావని, అకాల వర్షంతో ధాన్యం తడుస్తుందని తెలిపారు. రైతులకు అసౌకర్యం కలుగకుండా వెంటనే లారీలను సమకూర్చాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25లోపు ధాన్య కొనుగోళ్లను పూర్తి చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తక్షణమే తరలించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం తడవకుండా ముందస్తుగా టార్పాలిన్లు ఏర్పాటు చేసుకోవాలని, ప్యాడీ క్లీనర్‌తో ధాన్యాన్ని శుభ్రపరిచి నాణ్యత గల ధాన్యాన్ని విక్రయించాలని, తేమ శాతాన్ని పరిశీలించాలని సూచించారు. అధికారులు, నిర్వాహకులు అప్రమత్తతో ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తాసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, డీసీఎస్‌ఓ రోజా, సివిల్ సప్లయ్ డీటీ బాలమణి, పీఏసీఎస్ సీఈఓ బాల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## ప్రతి గింజా కొనుగోలు చేస్తాం : అదనపు కలెక్టర్



వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ధాన్యం సేకరణను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

చౌటుప్పల్, మే 18 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని ప్రతి గింజా కొనుగోలు చేస్తామని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. జిల్లాలో ఇప్పటికే 375 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయన్నారు. అన్ని మండలాల్లో ఈ నెల 31లోపు కొనుగోళ్లు పూర్తి చేస్తామని తెలిపారు. ధాన్యం సేకరణకు 650 లారీలు అందుబాటులో ఉన్నాయని, మరో పది లారీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇప్పటికే రూ.470 కోట్లు రైతుల ఖాతాల్లో పడ్డాయన్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, తాసీల్దార్ హరికృష్ణ, ఏఓ ముత్యాల నాగరాజు ఉన్నారు.


## ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి : ఆర్డీఓ



బట్టుగూడెంలో ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ కృష్ణారెడ్డి

బీబీనగర్, మే 18 : కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలోని చిన్నరావులపల్లి, బట్టుగూడెం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు, కాదాంబరి రైస్ మిల్లును ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యాన్ని తూకం వేసి ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలన్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని తెలిపారు. కాంటా వేసిన రైతుల వివరాలను ఎప్పటికప్పుడు రిజిష్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం బట్టుగూడెంలోని రైస్ మిల్లును పరిశీలించారు. ఆయన వెంట తాసీల్దార్ భగత్, ఆర్ఐ వెంకట్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు త్వరగా చేపట్టాలి : రైతుసంఘం



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా నాయకుడు గోపాల్‌రెడ్డి

ఆత్మకూరు(ఎం), మే 18 : మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతుసంఘం జిల్లా నాయకుడు వంటిపెంటి గోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని పల్లెర్లలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాల్లో పోసి నెల రోజులు అయినా పూర్తి స్థాయిలో కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షానికి ధాన్యం తడవడంతో ఆరబెట్టలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి త్వరగా కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు వేయాలని కోరారు. సమావేశంలో నాయకులు రచ్చ గోవర్ధన్, వేముల భిక్షం, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

## ఇక్కిరి ధర్మన్నకు నివాళి



ధర్మన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆలేరు రూరల్, మే 18 : సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు, టంగుటూరు మాజీ సర్పంచ్ ఇక్కిరి ధర్మన్న వర్ధంతిని ఆదివారం మండలంలోని టంగుటూరు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు రాచకొండ జనార్దన్, మామిడాల భిక్షపతి, కట్ట సమరసింహారెడ్డి, ధర్మన్న, సిద్ధేశ్వర్, సీత, అరవయ్య పాల్గొన్నారు.

## పార్టీలకతీతంగా మండల అభివృద్ధికి కృషి చేయాలి

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

మోటకొండూర్, మే 18 : మండల అభివృద్ధికి పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆదివారం మండలం అభివృద్ధి, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కోసం అన్ని పార్టీల ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధి విషయంలో అధికారులు అలసత్వంగా ఉండకుండా సహకరించాలన్నారు. ఆయా పార్టీల నాయకులు చెప్పే సర్వే నెంబర్లను నమోదు చేసుకుని అధికారులు ప్రభుత్వ భూమిని గుర్తించాలని ఆదేశించారు. కార్యాలయాల నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలం ఎక్కడ ఉందో అధికారులు సర్వే చేసి రిపోర్టు అందజేయాలని సూచించారు. అంతకుముందు మండల కేంద్రంలో బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం చామాపూర్‌లో మాతమ్మ పండుగలో పాల్గొన్నారు. సమావేశంలో తాసీల్దార్ నాగదివ్య, ఎంపీడీఓ ఇందిర, ఎంపీఓ చంద్రశేఖర్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు బొట్ల యాదయ్య, వివిధ పార్టీల నాయకులు యెల్లంల సంజీవరెడ్డి, భాస్కరుణి రఘునాథరాజు, బొలగాని జయరాములు, బొలగాని సత్యనారాయణ, తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఎయిమ్స్‌కు సీపీఎం నాయకుడు రఘుపాల్ పార్థివదేహం అప్పగింత



రఘుపాల్ భౌతికకాయాన్ని బీబీనగర్ ఎయిమ్స్‌కు అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు, సీపీఎం నాయకులు

బీబీనగర్, మే 18 : సీపీఎం సీనియర్ నాయకుడు జి.రఘుపాల్ పార్థివదేహాన్ని బీబీనగర్ ఎయిమ్స్‌కు అప్పగించారు. రాజాపేట మండలానికి చెందిన రఘుపాల్ (84) అనారోగ్యంతో శనివారం హైదరాబాద్‌లో మృతిచెందారు. ఆయన కోరిక మేరకు పార్థివదేహాన్ని రఘుపాల్ కుటుంబ సభ్యులతో కలిసి సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ఆదివారం ఎయిమ్స్ హాస్పిటల్‌కు మెడికల్ రీసెర్చ్ కోసం అందజేశారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ రఘుపాల్ చిన్న వయసు నుంచే కమ్యూనిస్టు పార్టీకి ఆకర్షితుడై పనిచేస్తూ ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, సీపీఎం హైదరాబాద్ నగర కార్యదర్శిగా మూడు దఫాలు బాధ్యతలు నిర్వహించారన్నారు. వయసు మీద పడినా ప్రజల సమస్యలపై ఎంత దూరమైనా వెళ్లి పనిచేసేవారని కొనియాడారు. తన నిరాడంబరమైన జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమన్నారు. రఘుపాల్ ఆశయ సాధన కోసం ఎర్ర జెండా శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, ఎండీ జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనూరాధ, స్కైలాబ్ బాబు, మోకు కనకారెడ్డి, సీనియర్ నాయకులు జి.రాములు, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, సోమయ్య, పాలడుగు నాగార్జున, కల్లూరి మల్లేశం, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, పాల్గొన్నారు.

## అరటి గెలల మాటున పశువుల అక్రమ రవాణా

- పట్టుకున్న పోలీసులు



పోలీసుల అదుపులో నిందితులు, పశువులను తరలిస్తున్న డీసీఎం

చౌటుప్పల్ రూరల్, మే 18 : అరటి గెలలను అడ్డుగా పెట్టి పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మంచాలకు చెందిన రమావత్ శరత్ (25), తూర్పు గోదావరి జిల్లా తామరపల్లికి చెందిన దాసరి భగవాన్ (27) ఆంధ్రప్రదేశ్‌లోని పిఠాపురం సంత నుంచి హైదరాబాద్‌కు డీసీఎంలో 16 ఆవులు, 12 ఎద్దులను తరలిస్తున్నారు. డీసీఎంలో పశువులు కనిపించకుండా అరటి గెలలను అడ్డంగా పెట్టి తరలిస్తుండగా.. పోలీసులు పసిగట్టి అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

### భువనగిరిలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భువనగిరి అర్బన్, మే 18 : పట్టణంలోని మెయిన్ రోడ్డు వెంట 11కేవీ లైన్ల మెయింటెనెన్స్ పనుల నిమిత్తం చెట్ల తొలగింపు సందర్భంగా పలు ప్రాంతాలలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ సాయికృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి ఎస్ఎల్ఎన్ఎస్ కళాశాల వరకు, సంతోష్‌నగర్, శృతినగర్, పెంటోజీనగర్, హనుమాన్‌వాడ ప్రాంతాలకు ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

### ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం), మే 18 : మండలంలోని కూరెళ్లలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మారుపాక యాదయ్య అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి కేహెచ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొప్పుల హరిదీప్‌రెడ్డి సహకారంతో రూ.5వేలను స్థానిక బీఆర్ఎస్ నాయకులు అందజేసి సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాషబోయిన ఉప్పలయ్య, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎరుకల స్వామిగౌడ్, నాయకులు నర్సింహ, మణికుమార్, గణేశ్, వెంకటయ్య పాల్గొన్నారు.

## దళితుల భూములకు పట్టాలు ఇవ్వాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహ



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహ

భువనగిరి కలెక్టరేట్, మే 18 : మండలంలోని హన్మాపురం గ్రామంలోని సర్వే నెంబర్ 87లో 15ఎకరాల 12 గుంటల ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్న దళిత కుటుంబాలకు వెంటనే పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం దళితులు సేద్యం చేసుకుంటున్న ప్రభుత్వ భూములను పరిశీలించి మాట్లాడారు. 70, 80 సంవత్సరాలుగా దళితులు ప్రభుత్వ భూమిని సేద్యం చేసుకొని బతుకుతున్నారన్నారు. నాటి నుంచి పట్టా సర్టిఫికెట్ల కోసం అనేక మార్లు ప్రభుత్వానికి దరఖాస్తులు పెట్టుకొని ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. నేటికీ పట్టా సర్టిఫికెట్లు ఇవ్వలేదన్నారు. వెంటనే పట్టాదారు పాసుబుక్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు దయ్యాల నర్సింహ, వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, సాగుదారులు రాజు, బాలనర్సింహ, ఉప్పలయ్య, భిక్షపతి, ఉప్పలయ్య, జహంగీర్, పరమేశ్, ప్రభాకర్, మహేశ్, లింగం పాల్గొన్నారు.

## ధాన్యం నిల్వ లేకుండా వెంటనే కొనుగోలు చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు



మహాసభలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

భువనగిరి అర్బన్, మే 18 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ మండల 9వ మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైతులు పండించిన ధాన్యం ఐకేపీ కేంద్రాల్లో వేల క్వింటాళ్లలో నిల్వ ఉన్నాయన్నారు. రైస్ మిల్లర్లు వెంటనే తీసుకెళ్లకుండా జాప్యం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన దాని కంటే క్వింటాలుకు 7–8 కిలోల తరుగు తీస్తున్నారన్నారు. దీంతో రైతులు ఎంతో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైస్ మిల్లర్ల యజమానులు నిబంధనలు పాటించడం లేదని, జిల్లా అధికార యంత్రాంగం పర్యవేక్షణ సరిగా లేదని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వ లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని, తరుగు తీయకుండా చూడాలని జిల్లా అధికారులను కోరారు. మండలంలో ప్రభుత్వ భూముల పట్టాలను లబ్ధిదారులకు ఏప్రిల్‌లో ఇస్తామని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి చెప్పారని, నేటికీ అమలు చేయలేదని అన్నారు. వెంటనే అందించకుంటే పట్టాల సాధన కోసం సమరశీల పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. మహాసభలో సీపీఐ నాయకులు ఏశాల అశోక్, దాసరి లక్ష్మయ్య, మరిపెల్లి రాములు, ఉడుత రాఘవులు, బబ్బూరి అంజమ్మ, కోట శంకర్ పాల్గొన్నారు.

## అత్తామామలపై అల్లుడు దాడి

- అత్త మృతి
- మామకు తీవ్ర గాయాలు



సంఘటన స్థలంలో మహిళ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గుండాల, మే 18 : డబ్బుల విషయమై గొడవ పడ్డి అత్తామామలపై అల్లుడు విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో అత్త మృతి చెందగా.. మామ తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ సంఘటన మండలంలోని సుద్దాల గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలం పిట్టలగూడెం (ఎనబావిగూడెం) గ్రామానికి చెందిన సంచార తెగ గుజురోతు చిన్నరాములు, జున్నుబాయి దంపతులు గుండాల మండలంలోని సుద్దాల గ్రామంలో గూడ పృథ్వీకి చెందిన మామిడి తోటను లీజుకు తీసుకున్నారు. చిన్నరాములు దంపతులు అదే మామిడి తోటలో జీవనం కొనసాగిస్తున్నారు. శనివారం రాత్రి వారి వద్దకు వాళ్ల అల్లుడు కాలియా కనకయ్య వచ్చాడు. తమకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వడం లేదంటూ గొడవ పడ్డాడు. వారి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో కనకయ్య ఆవేశంతో చిన్నరాములు, జున్నుబాయిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. దాంతో జున్నుబాయి అక్కడే మరణించింది. చిన్నరాములు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. తన తల్లిదండ్రులపై దాడి చేసి తన తల్లి జున్నుబాయిని కనకయ్య హత్య చేశాడని, ఆమె కూతురు పెంటమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.సైదులు తెలిపారు.

### ఘటన స్థలాన్ని పరిశీలించిన డీసీపీ

డీసీపీ అక్షాంశ్‌యాదవ్ ఆదివారం సీఐ శంకర్‌గౌడ్, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం విభాగాలతో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఘటన స్థలంలో పోలీసులు వేలి ముద్రలు తదితర ఆధారాలను సేకరించారు. అనంతరం జున్నుబాయి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలపాలైన చిన్నరాములును మెరుగైన చికిత్స నిమిత్తం జనగామ ఏరియా దవాఖానకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## ప్రజలంతా భక్తిభావంతో మెలగాలి : మహేందర్‌రెడ్డి



గొంగిడి మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న చామాపూర్ గ్రామస్తులు

మోటకొండూర్, మే 18 : ప్రజలంతా భక్తిభావంతో మెలగాలని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చామాపూర్ గ్రామంలో ఆదివారం మాతమ్మ పండుగలో ఆయన పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామదేవతల పండుగలను ప్రజలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. అనంతరం మహేందర్‌రెడ్డిని గ్రామస్తులు శాలువాతో సన్మానించారు.

## నియోజకవర్గంలో పడకేసిన ప్రజా సమస్యలు

- పార్టీలు మారిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మాటలు హాస్యాస్పదం
- బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు నిరంజన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

చౌటుప్పల్, మే 18 : మునుగోడు నియోజకవర్గంలో ప్రజా సమస్యలు పడకేశాయని, వాటిని పరిష్కరించే వారే కరువయ్యారని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గిర్కటి నిరంజన్, సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పెద్దింటి బుచ్చిరెడ్డి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గంలో సమీక్షల పేరుతో కాలయాపన తప్ప పనులు జరుగడం లేదన్నారు. కాంగ్రెస్‌లో షాడో ఎమ్మెల్యేలు పుట్టుకొచ్చారని ఎద్దేవా చేశారు. రూ.18వేల కోట్ల కాంట్రాక్టుల కోసం పార్టీలు మారిన రాజగోపాల్‌రెడ్డి.. మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కూసుకుంట్ల విజన్ ఉన్న నాయకుడని తెలిపారు. ఆయన హయాంలో రూ.570 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఆయన చేసిన పనుల శిలాఫలకాలు పగులగొట్టి, రంగులు వేసి ప్రస్తుతం ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి శంకుస్థాపనలు చేస్తున్నారని విమర్శించారు.

ధాన్యం కొనుగోళ్లు, నీటి సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకోవడానికే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి చౌటుప్పల్‌లో పర్యటించారని తెలిపారు. అధికారం ఉన్నా, లేకున్నా నిరంతరం ప్రజల్లో ఉండే కూసుకుంట్ల పర్యటనతో కాంగ్రెస్ నాయకులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులపై విమర్శలు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఢిల్లీ మాధవరెడ్డి, కురుమ బాలరాజు, ఉడుగు మల్లేశ్, తోర్పునూరి నర్సింహ పాల్గొన్నారు.

## 'పేదల సమస్యలపై నిరంతరం పోరాడిన బక్కారెడ్డి'



బక్కారెడ్డి స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మోత్కూరు, మే 18 : సీపీఐ దివంగత నేత కొణతం బక్కారెడ్డి పేదల సమస్యలపై నిరంతరం పోరాడిన యోధుడని, ఆయన ఆశయాల కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కేఆర్ భవనం వద్ద ఆదివారం బక్కారెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్తూపం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో బక్కారెడ్డి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్, గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు చాపల అంజయ్య, నాయకులు తిరుపతయ్య, నర్సింహ, శేఖర్‌రెడ్డి, అబ్బాస్ అలీ, రాములు, వీరస్వామి, పి.లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం

ఆత్మకూరు(ఎం), మే 18 : గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి ప్రతి నెలా 1న ట్రెజరీ ద్వారా వేతనాలు ఇవ్వాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అందివ్వడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సమావేశంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కూరెళ్ల కిష్టయ్య, ఇంద్రపల్లి జ్ఞానేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు నోముల స్వామి, నాయకులు శ్రీను, లక్ష్మయ్య, యాదయ్య, ముత్తయ్య, పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.

## గుడి చుట్టూ అల్లుకున్న పూల చెట్టు



ఆలయం చుట్టూ అల్లుకున్న రాధమనోహర పూల చెట్టు

ఆత్మకూరు(ఎం), మే 18 : మండలంలోని పల్లెపహాడ్ ఎస్సీ కాలనీలో గల ఎల్లమ్మ దేవాలయం వద్ద 10సంవత్సరాల క్రితం రాధమనోహరం పూల మొక్కను నాటి సంరక్షించారు. అది నేడు గుడి చుట్టూ అల్లుకొని తెల్లని, గులాబీ రంగు పూలతో చూపరులను ఆకట్టుకుంటుంది. పూలు సువాసన వెదజల్లుతున్నాయి. గుడి చుట్టూ అల్లుకున్న పూల చెట్టు ఎంతగానో ఆకర్షిస్తుంది.